నేడు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు ధర్నాలు

ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్

జనగామ, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ) : ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతు లందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం జిల్లావ్యాప్తంగా రైతు ధర్నాలకు బీఆర్ఎస్ సిద్ధమైంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాలతో జనగామ ఆర్టీసీ చౌరస్తా(పోలీస్ కంట్రోల్‌రూం) వద్ద ఉదయం 11 గంటలకు ధర్నా నిర్వహిస్తున్నట్లు పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేశ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బైరగోని యాదగిరిగౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జనగామ నియోజకవర్గంలోని మాజీ ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామ శాఖల అధ్యక్షులు, పీఏసీఎస్ డైరెక్టర్లు, మండల యువజన నాయకులు, సోషల్ మీడియా వారియర్స్, మున్సిపల్ కౌన్సిలర్లు, మైనారిటీ నాయకులు, రైతులు పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.

చిన్నారులు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలి

కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న రూపాచైతన్య

బచ్చన్నపేట,ఆగస్టు 21 : అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ప్రతిరోజూ పౌష్టికాహారం అందించాలని ఎంపీడీవో మల్లికార్జున్ సూచించారు. బుధవారం మండలంలోని కొడవటూరుతోపాటు పలు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. కొడవటూరులో పంచాయతీ కార్యదర్శి బృంగి రూపాచైతన్య, కొన్నెలో రాజశేఖర్, గోపాల్‌నగర్‌లో మోకు కవిత అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. పిల్లల హాజరు, స్టాకు వివరాలను తెలుసుకున్నారు. అంగన్‌వాడీ టీచర్లు ప్రేమలక్ష్మి, ఉషారాణి, విజయ, కమల పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణపై పునరాలోచించాలి'

జనగామ, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ) : ఎస్సీ వర్గీకరణపై ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించాలని కోరుతూ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఇచ్చిన భారత్ బంద్ బుధవారం జిల్లాలో పాక్షికంగా జరిగింది. జిల్లా కేంద్రంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకుల పిలుపు మేరకు విద్యా సంస్థలు, వాణిజ్య, వ్యాపార సంస్థలు బంద్‌లో పాక్షికంగా పాల్గొన్నాయి. ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా సుప్రీంకోర్టు ఇచ్చిన జడ్జిమెంట్ కాపీపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేసిన తర్వాత తమ నిర్ణయాన్ని ప్రకటించాలి తప్ప ఏకపక్ష ధోరణితో మిగిలిన వర్గాలకు నష్టాన్ని తెచ్చిపెట్టొద్దని మాల సంఘం నేతలు అన్నారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర నాయకులు, మాల మహాసభ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ తాటి కుమార్, ప్రధాన కార్యదర్శి ముత్యం నాగభూషణం, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గద్ద సాయి, జిల్లా అధ్యక్షుడు నీలం స్వామి మాల, రాష్ట్ర కార్యదర్శి గునిగంటి చంద్రశేఖర్, నాయకులు ఎండబట్ల పరశురాములు, అఖిల్, చెవుల రాజేశ్, బందెల నరసింహులు పాల్గొన్నారు.

ఉత్తమ అధ్యాపకుడు అప్జల్‌కు సన్మానం

అప్జల్‌ను సన్మానిస్తున్న పావని కుమారి

జనగామ, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ) : స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ఉత్తమ అధ్యాపకుడిగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్న జనగామ ధర్మకంచ ప్రభుత్వ జూనియర్ కళాశాల (ఆటోమొబైల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నీషియన్) మహ్మద్ అప్జల్‌ను బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ పావని కుమారి, అధ్యాపకులు సత్కరించారు. ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దిన అప్జల్‌ను సన్మానించడం సంతోషంగా ఉందని కళాశాల స్టాఫ్ సెక్రటరీ డాక్టర్ వస్కుల శ్రీనివాస్ అన్నారు.

నేడు జఫర్‌గఢ్‌కు ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జఫర్‌గఢ్, ఆగస్టు 21 : కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల్లో మండలంలోని ఆయా గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను పంపిణీ చేసేందుకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి గురువారం మండల కేంద్రానికి వస్తున్నారని డీటీ హరి ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు.

స్త్రీనిధి రుణాల్లో 50 శాతం రికవరీ చేయాలి

కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ) : స్త్రీ నిధి రుణాలను 50 శాతం రికవరీ చేయాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్‌తో కలిసి జిల్లా పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మండల సమాఖ్య అధ్యక్షులు, ఏపీఎంలతో సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 12 మండలాల వారీగా మొత్తం టీఎల్ఎఫ్‌లు ఒకటి, ఎస్ఎల్ఎఫ్‌లు 36, సెర్ప్ కింద వీవోలు 466 మంది ఉన్నారన్నారు. మహిళా శక్తి పథకం కింద కొత్త స్త్రీనిధి రుణాలను నిబంధనల మేరకు మంజూరు చేయాలన్నారు. క్రెడిట్ ప్లాన్ పెంచి తక్కువ శాతం రుణాల రికవరీ ఉన్న మండలాలు తప్పనిసరిగా 50 శాతం రికవరీకి చేరుకోవాలని సూచించారు. 33 నుంచి 55 శాతం రుణాల రికవరీ ఉన్న మండలాలు కచ్చితంగా 65 శాతం లక్ష్యాన్ని సాధించాలని కలెక్టర్ కోరారు. రఘునాథపల్లి, జనగామ మండలాలు 85 శాతం రుణాల రికవరీ సాధించాలన్నారు. ప్రక్రియ మొత్తం సెప్టెంబర్ 10 నుంచి 15 లోపు పూర్తి చేయాలని షేక్‌రిజ్వాన్ బాషా అన్నారు. పెండింగ్ రుణాల రికవరీకి విజిట్ యాక్షన్ ప్లాన్ రూపొందించాలని, ప్రతి వీవో ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడైతే స్త్రీ నిధి రుణాల రికవరీ చేయకుండా, క్రెడిట్ ప్లాన్ రుణాలను మంజూరు చేయకపోయినా, లబ్ధిదారులను ఇబ్బందులకు గురి చేసినా అలాంటి వీవోఏలను తొలగిస్తామని కలెక్టర్ హెచ్చరించారు. ఈసమావేశంలో డీఆర్డీఏ వసంత, డీపీవో స్వరూప, డీఏవో వినోద్ కుమార్, డీవీహెచ్‌వో ఎస్ఎల్ మనోహర్, అడిషనల్ డీఆర్డీఏ (సెర్ప్) శ్రీనివాస్, మండల సమాఖ్య అధ్యక్షులు, ఏపీఎంలు, స్త్రీ నిధి అసిస్టెంట్ మేనేజర్లు పాల్గొన్నారు.

మండల కేంద్రాల్లో ఎల్ఆర్ఎస్ హెల్ప్‌డెస్క్‌లు

ఎల్ఆర్ఎస్ యాప్‌లో దరఖాస్తుదారుల పూర్తి వివరాలను నమోదు చేయడం సహా అన్ని మండల రెవెన్యూ కార్యాలయాల్లో ఎల్ఆర్ఎస్ హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. బుధవారం ఎంపీడీఓలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎల్ఆర్ఎస్ కోసం 52 వేల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. దీనిని అత్యంత ప్రాధాన్యత అంశంగా ప్రభుత్వం గుర్తించిన నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులు, ఆర్ఐలు, ఇరిగేషన్ ఏఈలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. దరఖాస్తుదారులకు అవగాహన కల్పించేందుకు వివరాల్లో కరెక్షన్స్ కోసం సంబంధించిన పత్రాలను సమర్పించాలని గ్రామ పంచాయతీల నోటీసు బోర్డులో ప్రదర్శించాలన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు, జఫర్‌గఢ్ మండలాలు 'కుడా' మాస్టర్ ప్లాన్‌లో వస్తున్నందున విలేజ్ మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్డు వెడల్పుసరిచూసుకోవాలన్నారు. శనివారం వరకు ప్రతి గ్రామ పంచాయతీల వారీగా వంద దరఖాస్తుల లక్ష్యంగా ఎల్ఆర్ఎస్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. త్వరితగతిన ప్రక్రియ పూర్తి చేసిన మూడు మండలాల బృందాలను ఎంపిక చేసి పురస్కారాలు అందిస్తామని వెల్లడించారు. అనంతరం పాము కాట్లు, కుక్కల బెడదపై ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశంలో జడ్పీ సీఈవో సరిత, డీపీవో స్వరూప, ఈడీఎం గౌతం పాల్గొన్నారు.

23న నూతన ఆర్‌వోఆర్ చట్టంపై చర్చ..

ధరణి సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకురానున్న నూతన ఆర్‌వోఆర్ చట్టం-2024పై సూచనలు, సలహాలపై చర్చించేందుకు ఈనెల 23న సాయంత్రం 3గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో చర్చా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు.

స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక కృషి

వరంగల్ ఎంపీ కడియం కావ్య

ఎంపీ కావ్య, ఎమ్మెల్యే శ్రీహరిని ఆశీర్వదిస్తున్న పాస్టర్లు

స్టేషన్ ఘన్‌పూర్, ఆగస్టు 21 : ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో తనకు భారీ మెజార్టీ ఇచ్చిన స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలకనుగుణంగా అభివృద్ధికి కృషి చేస్తానని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. బుధవారం మండలంలోని శివునిపల్లిలో నియోజకవర్గ పాస్టర్ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కావ్యతోపాటు స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరయ్యారు. శివునిపల్లిలో నూతన చర్చి దర్వాజ పూజలో వారు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కడియం కావ్య గెలుపు కోసం ప్రార్థనలు చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ప్రజల మద్దతుతోనే తాను, తన కూతురు కావ్య విజయం సాధించారని తెలిపారు. భారతదేశంలో మాత్రమే ప్రజాస్వామ్యం పదిలంగా ఉందని, బంగ్లాదేశ్, పాకిస్తాన్, శ్రీలంక దేశాల్లో ఇందుకు భిన్నంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరి సహకారంతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ఆయన తెలిపారు. నిరుపేద పాస్టర్లకు అండగా ఉంటానని, ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని వెల్లడించారు. గ్రామాల్లో శస్మశాన వాటికలతో పాటు త్వరలో నియోజకవర్గం లోని ఏడు మండలాల్లో కమ్యూనిటీ హాళ్లు నిర్మిస్తానని అన్నారు.

స్నేహితుడి కుటుంబానికి పూర్వవిద్యార్థుల చేయూత

దేవరుప్పుల, ఆగస్టు 21: మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి పెండెం భాస్కర్ తండ్రి పెండెం అబ్బయ్య(80) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న స్నేహితులు, 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు బుధవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.11 వేలు ఆర్థిక సాయం అందించారు. అబ్బయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మిత్రులు రెడ్డిరాజుల రమేశ్, గుండు సుధాకర్, చిట్టబోయిన రమేశ్, గోరోజు మురళీ మోహన్, బైరు లక్ష్మయ్య, వరికెల రతన్, యాకయ్య, మహ్మద్ యాకూబ్, సారంగపాణి, సోమిరెడ్డి, లక్ష్మయ్య, యాదయ్య, మధు, అబ్బయ్య పాల్గొన్నారు

బొమ్మకూరు రిజర్వాయర్ నుంచి సాగు నీరందించాలి

రఘునాథపల్లి, ఆగస్టు 21: మండలంలోని మంగళిబండతండాకు బొమ్మకూరు రిజర్వాయర్ ద్వారా సాగునీరందించాలని స్థానిక రైతులు కోరారు. ఈ మేరకు స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని బుధవారం హనుమకొండలో నాయకులు, రైతులు కలిశారు. బొమ్మకూరు రిజర్వాయర్ నుంచి కాల్వ ద్వారా మేకలగట్టు నుంచి పటేల్ చెరువు వరకు నీటిని విడుదల చేయాలన్నారు. అక్కడి నుంచి వాగు ద్వారా సాగునీరందించాలని ఎమ్మెల్యే కడియం దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. దీనిపై కలెక్టర్‌కు లేఖ రాశారని వివరించారు. మాజీ సర్పంచ్ కొంకిసు పద్మ-ప్రకాశ్‌రెడ్డి, రామచంద్రునాయక్ పాల్గొన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలందించాలి

మొక్కలు నాటుతున్న వేణుమాధవ్

దేవరుప్పుల, ఆగస్టు 21: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలందించేలా ఉద్యోగులు కృషి చేయాలని ట్రాన్స్‌కో జనగామ ఎస్ఈ(ఆపరేషన్స్) టీ. వేణుమాధవ్ అన్నారు. మండల కేంద్రంలోని సబ్‌డివిజనల్ ఆఫీసులో బుధవారం విద్యుత్ ఉద్యోగుల సమావేశం ఏడీఈ అనిల్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన వేణుమాధవ్ మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌లో వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరించాలన్నారు. గృహోపయోగ, వ్యవసాయ, పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసి వినియోగదారుల మన్ననలు పొందాలని కోరారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద సేఫ్టీ కంచెలు నిర్మించాలని, ప్రమాదాల నివారణకు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం కార్యాలయ ప్రాంగణంలో ఆయన మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో డీఈ ఎల్ఎన్ రెడ్డి, ఏడీఈ అనిల్‌కుమార్, దేవరుప్పుల ఏఈ సుధాకర్, సింగరాజుపల్లి ఏఈ రాజవర్ధన్‌రెడ్డి, సబ్ ఇంజనీర్లు సోనియా, ఉదయ్ పాల్గొన్నారు

రుణమాఫీ కాని రైతులు నేటి రైతు ధర్నాలకు తరలిరావాలి

బీఆర్ఎస్ నాయకుల పిలుపు

బచ్చన్నపేట/లింగాలఘనపురం/రఘునాథపల్లి/ జఫర్‌గఢ్/చిల్పూరు/జనగామరూరల్/స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 21 : రుణమాఫీ కాని రైతుల కోసం గురువారం జనగామలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే ర్యాలీ, ధర్నాకు తరలిరావాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు బీఆర్ఎస్ బచ్చన్నపేట మండల అధ్యక్షులు బొడిగం చంద్రారెడ్డి బుధవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులందరికీ రుణమాఫీ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గందమల్ల నరేందర్, యూత్ మండల అధ్యక్షుడు వడ్డేపల్లి ఉపేందర్‌రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు షబ్బీర్, జావీద్, ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు దూడల కనుకయ్యగౌడ్, మాజీ సర్పంచ్ వడ్డేపల్లి మల్లారెడ్డి పాల్గొన్నారు. ఇదిలా ఉండగా రైతులందరికీ షరతులేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం లింగాలఘనపురం మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. మాజీ ఎంపీపీ చిట్ల జయశ్రీ, నాయకులు కేమిడి యాదగిరి, కేమిడి కవితా వెంకటేశ్, ఏదునూరి వీరన్న, బస్వగాని శ్రీనివాస్‌గౌడ్, ఎడ్ల రాజు, ఉడుగుల భాగ్యలక్ష్మి, గట్టగల్ల శ్రీహరి విలేకరులతో మాట్లాడారు. రఘునాథపల్లిలోని బ్యాంకుల ఎదుట గురువారం నిర్వహించే రైతుల ధర్నాను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వారాల రమేశ్‌యాదవ్ పిలుపు నిచ్చారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 10.30 గంటలకు జరిగే ధర్నాకు రుణమాఫీ కానీ రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు, మాజీ ప్రజా ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. జఫర్‌గఢ్‌లో నిర్వహించే రైతుల ధర్నాను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లెపాటి జయపాల్‌రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ డైరెక్టర్ వరుణ్, రాజ్‌కుమార్, నాయకులు శ్రీధర్, రాజు పాల్గొన్నారు. చిల్పూరు మండలం మల్కాపూర్ ఇండియన్ బ్యాంకు ఎదుట గురువారం నిర్వహించే ధర్నాకు వివిధ గ్రామాల్లో రుణమాఫీ కాని రైతులు హాజరుకావాలని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ శ్రేణులతోపాటు మాజీ ప్రజాప్రతినిధులు తరలిరావాలని ఆయన కోరారు. జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించే బీఆర్ఎస్ ధర్నాను విజయవంతం చేయాలని పార్టీ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు చినబోయిన రేఖ కోరారు. బుధవారం బీఆర్ఎస్ మండల కార్యదర్శులు ఎడ్ల శ్రీనివాస్, నిమ్మల స్వామి, నాయకులు పాషా, పాశం రాజిరెడ్డి, చినబోయిన రాజుతో కలసి విలేకరులతో మాట్లాడారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం లోని అన్ని మండలాలల్లో రుణమాఫీ కాని రైతులతో నేడు బ్యాంకుల ముందు ధర్నా నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. రైతులు తరలిరావాలని ఆయన కోరారు.

షరతులు లేకుండా రైతుల రుణాలు మాఫీ చేయాలి : సీపీఐ

ఏసోకు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

జఫర్‌గఢ్, ఆగస్టు 21 : షరతులు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతుల రుణాలను మాఫీ చేయాలని మండల కార్యదర్శి జువారి రమేశ్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. రమేశ్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నేతలు తాము అధికారంలోకి వస్తే పంట రుణాలను మాఫీ చేస్తామని గొప్పగా చెప్పి ఆచరణలో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం వ్యవసాయ అధికారులు. బ్యాంకర్లతో మాట్లాడి రూ.2 లక్షల వరకు రుణాలు మాఫీ చేయాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని వ్యవసాయ అధికారులకు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెండ్యాల సమ్మయ్య, ఎండీ యాకూబ్ పాష, గట్టుమల్లు, మంద బుచ్చయ్య, ఎండీ జాఫర్, యాకయ్య, నీలాసింగ్, హరిలాల్, సంతులు, రతన్ సింగ్, కృష్ణమూర్తి, సాంబయ్య పాల్గొన్నారు.

ఐదుగురు హెచ్ఎంలకు షోకాజ్ నోటీసులు

జఫర్‌గఢ్, ఆగస్టు 21 : మండలంలోని ఐదు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం 25 శాతం కంటే తక్కువగా ఉన్నందున ఆయా పాఠశాలల హెచ్ఎంలకు విద్యాశాఖ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. తీగారం, హిమ్మత్‌నగర్, ముగ్ధంతండా ప్రాథమిక పాఠశాలలు, కేజీబీబీ, మోడల్ స్కూళ్లలో విద్యార్థుల హాజరు శాతం తగ్గిందని ఇటీవల అధికారుల పరిశీలనలో వెలుగు చూసింది. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి రాము ఆయా పాఠశాలల హెచ్ఎంలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారని అధికారులు తెలిపారు. దీనిపై హెచ్ఎంలు వివరణ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

లింగాలఘనపురం, ఆగస్టు 21 : హనుమకొండ-హైదరాబాద్ హైవేపై నెల్లుట్ల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై బండి శ్రవణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ నుంచి హనుమకొండకు ఆర్టీసీ బస్సు వెళ్తుండగా రోడ్డుపై నడిచి వెళ్తున్న గుర్తు తెలియని మతిస్థిమితం లేని వ్యక్తిని ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడి మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలిసిన వారు పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఫేక్ సర్టిఫికెట్లతో 'కల్యాణలక్ష్మి' పొందిన వ్యక్తిపై కేసు

దేవరుప్పుల, ఆగస్టు 21: తన కూతురు-అల్లుడు పెళ్లి పేర తప్పుడు మ్యారేజ్ సర్టిఫికెట్లు సృష్టించి కల్యాణలక్ష్మి పథకంలో లబ్ధి పొందిన మండలంలోని మాధాపురం లకావత్ తండాకు చెందిన లకావత్ నందాపై కేసు నమోదు చేశారు. నిందితుడిని బుధవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించారని ఎస్సై సృజన్ కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం నీలిబండ తండాకు చెందిన ఆంగోత్ నరేందర్ ఈ విషయంలో నందాపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేశామని తెలిపారు. ప్రభుత్వం సంక్షేమ పథకాల్లో లబ్ధిపొందేందుకు లకావత్ నందా మోసానికి పాల్పడినట్లు తేలడంతో కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచినట్టు సృజన్‌కుమార్ వివరించారు. మోసాలకు పాల్పడితే చట్ట రీత్యా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

స్టేషన్ ఘన్‌పూర్, ఆగస్టు 21 : అప్పుల బాధతో ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని రాఘవాపూర్‌లో చోటు చేసుకుంది. సీఐ వేణు తెలిపిన వివరాల ప్రకారం.. రాఘవాపూర్‌కు చెందిన ఎడెల్లి కుమార్ (40) కు భార్య, కూతురు ఉన్నారు. కూలి పనులు చేసే కుమార్ మహిళా సంఘంతోపాటు , చాగల్లులో రూ.లక్షా 70 వేలు అప్పు చేశాడు. మరోవైపు మద్యానికి బానిసై ఇంట్లో గొడవ పడేవాడు. దీంతో రాఖీ పౌర్ణమికి ముందు భార్య కూతురును తీసుకుని వెళ్లిపోయింది. ఈ క్రమంలో కుమార్ బుధవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని సీఐ వేణు తెలిపారు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

కుటుంబ కలహాలతో మరొకరు..

నర్మెట, ఆగస్టు 21 : కుటుంబ కలహాలతో ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని వెల్దండలో బుధవారం జరిగింది. ఎస్సై నైనాల నగేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెల్దండకు చెందిన కాసర్ల రాజు(38) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో భార్యభర్తల మధ్య చిన్న చిన్న తగాదాలతో మనస్తాపానికి గురైన రాజు బుధవారం వ్యవసాయభూమిలో పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నం చేసుకున్నాడు. గమనించిన స్థానికులు బాధితుడిని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కొరకు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ ఘటనపై మృతుడి సోదరుడి ఫిర్యాధు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నైనాల నగేశ్ విలేకరులకు తెలిపారు.

విధులపై పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

వివరాలను తెలుసుకుంటున్న డీసీపీ రాజమహేంద్రనాయక్

నర్మెట, ఆగస్టు 21: విధుల పట్ల పోలీసులు అప్రమత్తంగా ఉండాలని జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి, కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదుదారులు నేరుగా రావొచ్చన్నారు. మధ్యవర్తులు, దళారులను ఆశ్రయించొద్దని సూచించారు. మత్తుపదార్థాలపై ప్రజలకు అవగాహన కల్పించి, వాటిని అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని ఎస్సై నగేశ్‌ను ఆదేశించారు.

ఓటరు జాబితాపై వీడియో కాన్ఫరెన్స్

దేవరుప్పుల, ఆగస్టు 21: పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా బుధవారం బూత్ లెవల్ ఆఫీసర్లకు తహసీల్దార్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల అధికారి ఎన్నికల నిర్వహణపై బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. ఓటరు జాబితా సవరణ, చేర్పులు, మార్పులు, వార్డుల వారీగా ఓటర్ల సవరణ చేయాలని కోరారు. కాగా కొత్త ఓటర్ల నమోదు, ఫారం 6, 7 స్వీకరణపై వివరించారు.

వాసవీమాతకు లక్ష పుష్పార్చన

లక్ష పుష్పార్చనలో భక్తులు

జనగామ, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ) : శ్రావణ మాసం సందర్భంగా జిల్లా కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో బుధవారం అమ్మవారికి 21 రకాల పూలతో లక్ష పుష్పార్చన, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం వాసవీ మాత ట్రస్ట్ నూతన భవన గృహ ప్రవేశంలో ట్రస్ట్ అధ్యక్షుడు పజ్జూరి గోపయ్య, బుద్ధా రమేశ్, పజ్జూరి లక్ష్మీ నర్సయ్య, మహం